క్లుప్తంగా

రగ్బీ పోటీలకు జట్టు ఎంపిక



జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టు క్రీడాకారులు

కర్నూలు (టౌన్): మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ పట్టణంలో ఈనెల 11, 12 తేదీల్లో నిర్వహించనున్న జాతీయస్థాయి బాలికల అండర్–15 రగ్బీ పోటీల్లో సత్తా చాటాలని ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు సూచించారు. ఆదివారం స్థానిక నగర శివారులోని దిన్నెదేవరపాడులోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ క్రీడా మైదానంలో.. జాతీయ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టును ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేగంగా అభివృద్ధి చెందుతున్న క్రీడల్లో రగ్బీ ఒకటని, అందులో రాణించాలన్నారు. గుర్తింపు ఉన్న క్రీడల వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఏపీ జట్టు మేనేజర్ జ్యోతి, జిల్లా రగ్బీ సంఘం ప్రతినిధి కొండెపోగు చిన్న సుంకన్న పాల్గొన్నారు.

మాస్టర్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తా



కప్పుతో బీ.టీ.అనురాధ

కర్నూలు (టౌన్): మాస్టర్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు నగరానికి చెందిన మహిళా న్యాయవాది ప్రతిభ చాటింది. ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు అనంతపురం పట్టణంలోని పీ.టీ.సీ స్టేడియంలో మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 43వ రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో న్యాయవాది, మాజీ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ బీ.టీ.అనురాధ 55 ఏళ్ల విభాగంలో పాల్గొన్నారు. 400×100, 400×200 రిలే పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాలు, కప్పు, అలాగే డిస్కస్ త్రోలో కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు అభినందనలు తెలియజేశారు.

హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న ఎస్.మునెప్ప

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప కోరారు. ఆదివారం ఏఐటీయూసీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయన్నారు. ఆటో కార్మికులు ప్రమాదాల బారిన పడి అవిటి వాళ్లు అవుతున్నా వారి సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. నూతన రోడ్డు పాలసీ ద్వారా కార్మికులు ప్రమాదాలకు బాధ్యత వహించి జైలుకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబునాయుడు ఆటో కార్మికులకు ఏడాదికి రూ.15 వేలు సాయం అందిస్తానని చెప్పారని, ఆ హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. హామీని నెరవేర్చాలనే డిమాండ్‌తో ఈ నెల 15వ తేదీన జిల్లా వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలకు పిలుపునిచ్చినట్లు చెప్పారు. నాయకులు వెంకటేష్, గణేష్, బీమరాజు, వీరేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

22, 23 తేదీల్లో వీహెచ్‌పీ శిక్షణ శిబిరం



వీహెచ్‌పీ జిల్లా సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు

కర్నూలు కల్చరల్: విశ్వహిందూ పరిషత్ శిక్షణా శిబిరాన్ని ఈనెల 22, 23 తేదీల్లో కర్నూలులో నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ ధర్మ ప్రసార్ రాష్ట్ర కన్వీనర్ ఏవీ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని వీహెచ్‌పీ కార్యాలయంలో జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ.. వీహెచ్‌పీ కార్యకర్తలకు హిందూ సనాతన ధర్మాన్ని కాపాడటం, ఆచరింప చేసేందుకు శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు హాజరై శిక్షణలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి మాట్లాడుతూ.. జిల్లా అభ్యాస వర్గ, వీహెచ్‌పీ జిల్లా సేవా ప్రకల్పం నగర శివారులోని జి.పుల్లారెడ్డి కళాశాల సమీపంలోని విజ్ఞాన పీఠంలో జరుగుతుందన్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర సేవా కన్వీనర్ గురుమూర్తి, విభాగ్ బజరంగ్ కన్వీనర్ రాజేష్, జిల్లా కార్యదర్శి భానుప్రకాష్, కోశాధికారి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

కృష్ణగిరి: మండలంలోని చిట్యాల గ్రామ శివారులో ఆదివారం వాటర్ ట్యాంక్ వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న గ్రామానికి చెందిన బోయ ఓబులమ్మపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. ఈమె వద్ద నుంచి 180 ఎంఎల్ పరిమాణం గల 20 మ్యాన్షన్‌హౌస్, 25 బ్రాందీ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

వణికించే మూర్ఛవ్యాధి





కొందరు చూడటానికి ఎంతో ఆరోగ్యంగా ఉంటారు. ఉన్నట్లుండి కింద పడి స్పృహ కోల్పోయి కాళ్లు, చేతులు కొట్టుకుంటూ ఉండటాన్ని మనం తరచూ చూస్తూ ఉంటాం. దీనినే ఫిట్స్ అంటారు. ఇలా ఫిట్స్ రెండుసార్లు అంతకన్నా ఎక్కువ సార్లు వస్తే దానిని ఎపిలెప్సీ అంటారు. ఈ వ్యాధిపై అవగాహన కల్పించడం కోసం ఇంటర్నేషనల్ సొసైటీ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి రెండో సోమవారం రోజున ఇంటర్నేషనల్ ఎపిలెప్సీ డే నిర్వహిస్తోంది.



- జిల్లాలో 15 వేల మందికి పైగా మూర్ఛ రోగులు
- ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా పరీక్షలు, మందులు, చికిత్స
- క్రమం తప్పకుండా మందులు వాడితే మేలు
- నేడు అంతర్జాతీయ మూర్ఛ వ్యాధి దినోత్సవం

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- క్రమం తప్పకుండా మందులు వాడాలి
- రోజుకు 6 – 8 గంటలు నిద్ర ఉండేలా చూసుకోవాలి
- మానసిక ఒత్తిడి లేకుండా చూసుకోవాలి
- మత్తు మందులు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి
- డ్రైవింగ్, స్విమ్మింగ్ ఆపడం మంచిది.
- జబ్బును తెలియజేసే కార్డును వెంట ఉంచుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని న్యూరాలజీ విభాగానికి సోమ, గురువారాల్లో నిర్వహించే ఓపీకి 250 మంది దాకా చికిత్స కోసం వస్తారు. అందులో 20 శాతం వరకు మూర్ఛ వ్యాధి బాధితులు ఉంటున్నారు. ఈ వ్యాధి గ్రస్తులకు ఆసుపత్రిలోని న్యూరాలజీ విభాగంలో ఈఈజీ, ఎపిలెప్సీ స్టడీ నెలకు 250, ఏడాదికి 3 వేల మందికి చేస్తున్నారు. అవసరమైన వారికి ఎంఆర్ఐ, వీడియో ఈఈజీ పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు. అంతేగాక జిల్లా మొత్తంగా సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యుల వద్దకు వెళ్లే వారు ప్రతి నెలా మరో 8 వేల మంది ఉంటారని అంచనా. కొందరు నాటు మందు వాడి తగ్గకపోతే అల్లోపతి చికిత్సకు వస్తున్నారు. ఇలాంటి వారికి ఒకేసారి ఎక్కువ డోసు మందులు ఇవ్వాల్సి ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఫిట్స్‌కు కారణాలు

కాన్పు సమయంలో రక్త సరఫరా శిశువుకు సరిగా అందకపోవడం వల్ల పుట్టిన పిల్లల్లో ఫిట్స్ రావొచ్చు. మెదడు ఎదుగుదల సరిగ్గా లేకపోవడం వల్ల ఫిట్స్ రావొచ్చు. కొంత మంది పిల్లల్లో జ్వరంతో పాటు ఫిట్స్ వస్తూ ఉంటాయి. కొన్ని జన్యుపరమైన కారణాలు కూడా ఈ వ్యాధికి దారి తీస్తాయి. మద్యం అతిగా తీసుకోవడం, ఒక్కసారిగా మానేయడం వల్ల, మాదకద్రవ్యాలు తీసుకోవడం వల్ల కూడా ఫిట్స్ రావొచ్చు. రోడ్డు ప్రమాదంలో తలకు గాయం అవ్వడం, బ్రెయిన్ ట్యూమర్స్ కూడా ఫిట్స్‌కు కారణం అవుతాయి.

లక్షణాలు

ముందస్తు హెచ్చరిక లేకుండా అకస్మాత్తుగా వస్తుంది. స్పృహ కోల్పోవడం, కాళ్లు, చేతులు నియంత్రణ కోల్పోవడం కనిపిస్తుంది. నోటి నుండి నురగ కారడం, నియంత్రణ లేకుండా మల, మూత్ర విసర్జనలు, నాలుక కొరుక్కోవడం వంటివి కనిపిస్తాయి. కొన్ని రకాల సాధారణ మూర్ఛలు శరీరంలో కొన్నిసార్లు జర్కులు రావడం (మయోక్లోనిక్ ఫిట్స్), కొన్నిసార్లు 10 నుంచి 20 సెకండ్ల వరకు స్పందించకుండా ఉంటుంది.

ఫిట్స్ వచ్చినప్పుడు ఇలా చేయాలి

ఎవరికైనా మూర్ఛ (ఫిట్స్) వచ్చినప్పుడు చుట్టుపక్కల ఉన్న ప్రమాదకరమైన వస్తువులను తొలగించాలి. వాంతిని మింగకుండా ఉండేలా పక్కకు తిప్పి పడుకోబెట్టాలి. తలకింద కాస్త ఎత్తుగా ఉండేలా ఏదైనా పెట్టాలి. తగినంత గాలి ఆడేలా చూడాలి. బలవంతంగా నీళ్లు తాగించేందుకు ప్రయత్నం చేయరాదు. చేతిలో తాళాలు, ఇనుప వస్తువులు మెడలో వేయడం, నోట్లో స్పూన్లు పెట్టడం చేయకూడదు. వెంటనే దగ్గర్లోని హాస్పిటల్‌కు తీసుకెళ్లాలి.

సరైన మోతాదులో మందులు వాడితే తగ్గుతుంది



మూర్ఛ వ్యాధికి 70 శాతం మందికి సరైన మందులను సరైన మోతాదులో వాడటం వల్ల నియంత్రణలోకి తీసుకురావచ్చు. 30 శాతం మందిలో రెండు రకాల మాత్రల కన్నా ఎక్కువ అవసరం అవుతాయి. అలాంటి వారిలో వీడియో ఈసీజీ, బ్రెయిన్ ఇమేజింగ్ సాయంతో మెదడులో ఫిట్స్ మొదలయ్యే ప్రాంతాన్ని గుర్తించి దాన్ని తొలగించవచ్చు. వాగస్ నర్వ్ స్టిములేషన్ (వీఎన్ఎస్)తో కూడా ఫిట్స్‌ను నియంత్రణలోకి తీసుకురావచ్చు. కిటోజెనిక్ డైట్ వంటివి కూడా ఉపయోగపడతాయి.

– డాక్టర్ చల్లేపల్లి బాబురావు, కన్సల్టెంట్ న్యూరాలజిస్టు, కర్నూలు

అందుబాటులో ఆధునిక మందులు



మూర్ఛ వ్యాధి ఏ వయస్సు వారికైనా రావచ్చు. ఈ వ్యాధికి ఆధునిక మందులు అందుబాటులో ఉన్నాయి. మందులకు తగ్గకపోతే సర్జరీ చేయాల్సి వస్తుంది. గర్భిణులకు ఈ వ్యాధి వస్తే వైద్యుల సూచనతో మందులు వాడాలి. పిల్లలకు వస్తే వ్యాధి తగ్గేంత వరకు మందులు వాడాలి. మందులు వాడటం వల్ల వారి మెదడుకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

– డాక్టర్ నాగసురేష్, న్యూరాలజిస్టు, కర్నూలు

సిలంబం పోటీలు ప్రారంభం

కర్నూలు (టౌన్): స్థానిక దామోదరం సంజీవయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి సిలంబం పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీల ప్రారంభ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిలంబం (కర్రసాము) క్రీడ వల్ల విద్యార్థినీ, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ధైర్యం పెంపొందుతుందన్నారు. ఒత్తిడిని అధిగమించేందుకు చిన్నారులు క్రీడల వైపు మొగ్గు చూపాలన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, రాఘవేంద్ర పాల్గొన్నారు.

నేడు నగరపాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు తమ కాలనీలలో నెలకొన్న సమస్యలను ఫిర్యాదుల రూపంలో తెలియజేయవచ్చన్నారు. ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అర్జీదారులు దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్‌తో హాజరు కావాలని సూచించారు.

ఎస్ఎఫ్ఐ నగర నూతన కమిటీ ఎన్నిక

కర్నూలు(సెంట్రల్): భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కర్నూలు నగర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా అబూబకర్, సాయి ఉదయ్ ఎంపికయ్యారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ఎస్ఎఫ్ఐ నగర మహాసభలు జరిగాయి. ముందుగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఆనంద్‌బాబు, జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, నగర కార్యదర్శి సాయి ఉదయ్, బాలికల విభాగం కన్వీనర్ కె.సంయుక్త జెండావిష్కరణ చేసి మహాసభలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులతోపాటు ఉపాధ్యక్షులుగా ఆర్యన్, మల్లేష్, అంజి, నగర సహాయ కార్యదర్శులుగా పృథ్వీ, ఎల్లా కృష్ణ, ఆదిత్య, కమిటీ సభ్యులుగా మరో 15 మందిని ఎన్నుకున్నారు.

ఘనంగా పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ నాయకులు

కల్లూరు: కర్నూలు నగరంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌వీ కృష్ణారెడ్డి, ఎం.ధనుంజయ ఆధ్వర్యంలో పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణానిధి మూర్తి, కల్లూరు ఎంఈఓ శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం, వారు ఎదుర్కొంటున్న వివక్షతను రూపుమాపడం కోసం పీఆర్‌టీయూ సంఘం దశాబ్దాలుగా పోరాటం చేస్తుందన్నారు. ఉపాధ్యాయుల శ్రేయస్సు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవి ప్రకాష్, రాష్ట్ర కౌన్సిలర్లు బాబురావు, ఆదినారాయణరెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అష్టావధానం



అవధాని బులుసు అపర్ణను సన్మానిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: గోదాగోకులం, తోపుదుర్తి వెంకట్రామ్ ఆధ్వర్యంలో ఆదివారం నగర శివారులోని గోదాగోకులంలో అవధాని బులుసు అపర్ణ నిర్వహించిన అష్టావధానం ఆహుతులను అలరించింది. విద్వాన్ మారేడు రాముడు, డాక్టర్ తొగట సురేష్ బాబు, డాక్టర్ వీపూరి వెంకటేశ్వర్లు, డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని, గొరెడ్డి హరిశ్చంద్రారెడ్డి మాదినేని మధుసూదన్, విద్వాన్ మునీశ్వరరావు, తోపుదుర్తి వెంకట్రామ్ పృచ్ఛకులుగా వ్యవహరించారు. మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్, మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత కేవీ రాజశేఖర్ అతిథులుగా పాల్గొని మాట్లాడారు. అనంతరం అవధాని బులుసు అపర్ణను సన్మానించారు. గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజు గుప్త, ముద్రిక సాహితీ స్రవంతి వ్యవస్థాపక అధ్యక్షుడు భాస్కర్, గోదాగోకులం పరివారం, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలి



పాణ్యంలో మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్ రెడ్డి

- కాలయాపన చేయడం తగదు
- ప్రజా సమస్యలు గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం
- మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: మండలంలోని పిన్నాపురం గ్రామంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు భూములిచ్చిన రైతులకు త్వరగా పరిహారం అందించాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కోరారు. ఆయన ఆదివారం పాణ్యంలోని ఇందిరా కాలనీలో శివదీక్ష స్వీకరించిన స్వాములతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సోలార్ పరిశ్రమకు భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం, కంపెనీ త్వరగా పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. పరిహారం నానాటికీ ఆలస్యం కావడంతో రైతుల్లో ఆందోళన నెలకొందన్నారు. దీనిపై ఇప్పటికే కలెక్టర్, కంపెనీ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినట్లు చెప్పారు. పరిహారం విషయంలో జాప్యం చేస్తే రైతుల తరఫున పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు.

ప్రజా సమస్యలను గాలికొదిలేసిన కూటమి

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో ప్రజా సమస్యలను గాలికొదిలేసిందని మాజీ ఎమ్మెల్యే కాటసాని విమర్శించారు. ఎక్కడ చూసినా సమస్యలు నెలకొన్నాయని, క్షేత్రస్థాయిలో వాటిని పరిష్కరించే అధికారులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసి, పేద విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం లేకుండా చేశారన్నారు. అంతేకాక ప్రభుత్వ పాఠశాలలో అందించే మధ్యాహ్న భోజనం నాణ్యత లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. అలాగే ఆరోగ్య వ్యవస్థను పూర్తిగా విస్మరించారని, లా అండ్ ఆర్డర్ గాడి తప్పిందన్నారు. ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపుతున్నా రని ఆరోపించారు. పని చేయకముందే ప్రచార ఆర్భాటాలు, గ్లోబల్ రేంజ్‌లో ప్రచారం చేసుకోవడం తప్పా క్షేత్రస్థాయిలో కూటమి ప్రభుత్వం చేసింది శూన్యమన్నారు. కూటమి ప్రభుత్వానికి త్వరలోనే ప్రజలు గుణపాఠం నేర్పుతారన్నారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, ఎల్ల గౌడ్, స్వామి, సత్యాలు, సురేంద్ర, రామ్ తదితరులు పాల్గొన్నారు.

27న అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గలో ఈ నెల 27వ తేదీన బాలుర అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు షేక్షావలి, షాషావలి ఆదివారం ఓ ప్రకటలో తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించనున్న ఈ పోటీల్లో విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేల చొప్పున నగదు బహుమతులు అందించనున్నట్లు ప్రకటించారు. ఆసక్తి గల జట్లు అదే రోజు ఉదయం 8 గంటలకు పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 90146 59220, 97014 78079 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అర్చకుడిపై దాడి హేయమైన చర్య

కర్నూలు కల్చరల్: చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి చేయడం హేయమైన చర్య అని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అఖిల భారత శ్రీవైష్ణవ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అగ్రహారం రాఘవేంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హిందుత్వానికి ఆలయ సంప్రదాయాలు చేసినటువంటి ఎన్నో ఉపకారాలను మరిచిపోయిన కొందరు దుండగులు హైందవ వేషంలో వారిపై స్వార్థ బుద్ధితో దాడి చేయడం ఏంటని ప్రశ్నించారు. 40 మంది వ్యక్తులు నలుపు వస్త్రాలు ధరించి వచ్చి రామరాజ్య సైన్యాన్ని ఏర్పాటు చేయడానికి విరాళాలు ఇవ్వాలంటూ భయభ్రాంతులకు గురి చేశారని పేర్కొన్నారు. దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.


కళాశాల గుర్తింపును రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న కర్నూలు నగర శివారులోని కేవీ సుబ్బారెడ్డి కళాశాల గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ముందస్తు పేరుతో అడ్మిషన్ల కోసం డబ్బులు వసూలు చేసిన యాజమాన్యం సంబంధిత విద్యార్థులకు అడ్మిషన్ అయినా ఇవ్వాలి లేదంటే కట్టిన డబ్బులైనా వెనక్కి ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. అలాగే సెమిస్టర్ పరీక్షలకు ఫీజు వసూలు చేయడం అన్యాయమన్నారు.

నర్సింగ్ పోస్టులను భర్తీ చేయాలి

కర్నూలు(సెంట్రల్): వైద్య ఆరోగ్య శాఖలో ఏఎన్ఎం గ్రేడ్–3 నర్సుల భర్తీ ప్రక్రియను వెంటనే చేపట్టాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సంధ్యారాణి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీలకు వెంటనే పదోన్నతులు కల్పించాలన్నారు. జిల్లాలో 12వ తేదీ నుంచి పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం కావడం సంతోషకరమన్నారు. పదోన్నతులను ఒక్కో జిల్లాలో ఒక్కో సమయంలో చేపట్టడంతో కొన్ని సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. అన్నిజిల్లాల్లో ఒకేసారి పదోన్నతులు చేపట్టాలని కోరారు. నాయకులు పద్మావతి, మంజుల, విజయకుమారి పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి



షేక్ మహమ్మద్ హనీఫ్ (ఫైల్)

కర్నూలు (టౌన్) నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి కోలుకోలేక మృతి చెందాడు. స్థానిక వీకర్ సెక్షన్ కాలనీలో నివసించే షేక్ మహమ్మద్ హనీఫ్ (53) సిల్వర్ సామాన్ల వ్యాపారం చేస్తున్నాడు. ఈయనకు భార్య, ముగ్గురు కుమారులు. మద్యం తాగే అలవాటు ఉంది. భార్యతో తరచూ గొడవ పడేవాడు. ఈ నెల 6న తాగి గొడవ పడటంతో భార్య విసుగుచెంది పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెంది ఇంటి ముందు కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇరుగుపొరుగు వారు మంటలను ఆర్పి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ ఈ నెల 8వ తేదీ రాత్రి చనిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. కుమారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

కార్ల సర్వీస్ సెంటర్‌లో అగ్ని ప్రమాదం

కర్నూలు కల్చరల్: స్థానిక వీఆర్ కాలనీలోని శ్రీహరి సర్వీసింగ్ సెంటర్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. రాజేశ్వర్ రెడ్డి నిర్వహిస్తున్న సర్వీస్ సెంటర్‌లో ఆదివారం తెల్లవారుజామున ఓ కారు నుంచి మంటలు రావడంతో చుట్టుపక్కల వారు అగ్నిమాపక శాఖ వారికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఒక కారు పూర్తిగా కాలిపోవడం, రెండు కార్లు పాక్షికంగా కాలిపోయాయి. కారులో షార్ట్ సర్క్యూట్ జరగడంతోనే ప్రమాదం చోటు చేసుకున్నట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. రూ.లక్షల్లో నష్టం వాటిల్లినట్లు గుర్తించారు.

కార్బైడ్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలి



ఫ్యాక్టరీ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

కర్నూలు(సెంట్రల్): నగర శివారులోని కార్బైడ్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలని యూనియన్ నాయకులు లక్ష్మన్న బత్తుల భాస్కరరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కార్మికులు ఫ్యాక్టరీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులకు వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. రూ.5 కోట్ల పెండింగ్ పీఎఫ్‌ను సంబంధిత కార్మికుల ఖాతాలకు జమ చేయాలన్నారు. ఒకవైపు కార్మికులు మరణిస్తున్నా యాజమాన్యం మాత్రం పెండింగ్ వేతనాలు, పీఎఫ్‌లను చెల్లించేందుకు చర్యలు తీసుకోకపోవడం అన్యాయమని వాపోయారు. సుమారు 120 మంది కార్మికులకు వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు. విలువైన ఫ్యాక్టరీ భూములను యాజమాన్యం అమ్ముకోవాలని చూస్తోందని ఆరోపించారు. యూనియన్ నాయకులు శివ, సోలోమాన్, బతుకన్న, ఆనంద్,ప్రసాదు, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

చిన్నతనం నుంచే నైతిక విలువలు నేర్పించాలి



చిన్నారులకు శ్లోకాలను నేర్పిస్తున్న స్వామిని సుప్రేమానంద సరస్వతి

కర్నూలు కల్చరల్: తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుంచే నైతిక విలువలు నేర్పించాలని చిన్మయ మిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతి అన్నారు. ఆదివారం వీఆర్ కాలనీలోని చిన్మయ ప్రభావళిలో బాల వికాస్ తరగతులు నిర్వహించారు. భగవద్గీతలోని అంశాలను వివరించారు. పిల్లలకు మన పురాణ ఇతిహాసాల్లోని ఇతి వృత్తాలను చెప్పాలన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మంచి పౌరులుగా తయారు కావడంలో తల్లిదండ్రులు, గురువుల పాత్ర ఎంతో ఉందన్నారు. చిన్నారులు శ్లోకాలను పఠనం చేశారు.

రాజశ్యామల దేవీ నమోస్తుతే





ప్రత్యేక అలంకారణలో రాజశ్యామల అమ్మవారు, రాజశ్యామల హోమంలో భక్తులు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో గత ఎనిమిది రోజులుగా నిర్వహిస్తున్న రాజశ్యామల నవరాత్రుల వ్రతాలు తొమ్మిదో రోజు ఆదివారం ముగిశాయి. అమ్మవారికి అభిషేకం, అర్చనలు, విశేష పూజలు, భజనలు నిర్వహించారు. పండితులు మామిళ్లపల్లి రాజేష్ శర్మ ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం రాజశ్యామల అమ్మవారి హోమం నిర్వహించారు. విష్ణు సహస్ర పారాయణం, లలితా సహస్ర పారాయణం చేశారు. పూర్ణాహుతితో పూజలు ముగిశాయి. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి మాట్లాడుతూ.. వివేకం మేధస్సు, విజ్ఞానం అనుగ్రహించే రాజశ్యామల అమ్మవారి నవరాత్రులు నిర్వహించడం ఎన్నో జన్మల పుణ్య ఫలం అన్నారు. లలితా సంఘం అధ్యక్షుడు తెల్లాకుల జ్ఞానేశ్వరమ్మ, లలితా పీఠం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అనుబంధాల కలయిక



అన్నెం కుటుంబ సభ్యుల గ్రూప్ ఫోటో

కర్నూలు కల్చరల్: అనురాగ అనుబంధాల నందనవనం అన్నెం కుటుంబం. ఒకే కుటుంబానికి చెందిన నాలుగు తరాల వారు మొత్తం 150 మంది ఒక చోట చేరి ఆత్మీయత అనురాగాలను పంచుకున్నారు. ఇదంతా ఆదివారం నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని గెలాక్సీ ఫామ్ హౌస్ వేదికగా జరిగింది. ప్రకాశం జిల్లా కంభం మండలంలోని లింగాపురానికి చెందిన అన్నెం ఉల్లక్కిరెడ్డి, అన్నెం నాంచార రెడ్డి కుటుంబాలకు చెందిన నాలుగు తరాల వారు ఉద్యోగ, వ్యాపార రీత్యా దేశ విదేశాల్లో నివశిస్తున్నారు. వారంతా ఒక చోట చేరి ఆత్మీయతను చాటుకోవడం విశేషం. దశాబ్దం క్రితం కర్నూలులో ఇలాంటి వేడుకను నిర్వహించుకున్నారు. మళ్లీ ఇప్పుడు తిరిగి కలుసుకున్నారు. ఆర్కెస్ట్రా, మిమిక్రీ, మ్యాజిక్ ఆర్టిస్టుల ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేసుకొని ఉల్లాసంగా గడిపారు. 60 సంవత్సరాలు దాటిన కుటుంబ పెద్దల నుంచి ఆశీర్వాదాలు పొందారు.

అన్నెం కుటుంబంలో మొదటి తరం వారు శంకర్ రెడ్డి, వెంకటరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, వారి సంతానంలో పద్మనాభరెడ్డి, పార్వతి, రామకోటి రెడ్డి, శివమ్మ, రామకృష్ణారెడ్డి, రామసుబ్బమ్మ దంపతులు ఉన్నారు. వీరిలో మొదటి తరంలో 20 మంది మనుమళ్లు, 10 మంది మనుమరాళ్లు, రెండో తరంలో 28 మంది మనమళ్లు, 22 మంది మనుమరాళ్లు, మూడో తరంలో 15 మంది మనుమళ్లు, 25 మంది మనురాళ్లు, నాలుగో తరంలో 8 మంది మనుమళ్లు, 12 మంది మనుమరాళ్లు ఉన్నారు.